క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి..



రక్తదానం చేస్తున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక విజయ బ్లడ్‌బ్యాంక్‌లో ఏపీజే అబ్దుల్ కలామ్ బ్లడ్ బ్యాంక్ వారు నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ, మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడగలడని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

విజయనగరం టౌన్: నిరుపేద మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు నవ యువత వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బి.స్వాతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు 45 రోజులు శిక్షణ ఇస్తామని, ఆసక్తి గల వారు ఈ నెల 31లోగా లక్కపందిరివారి వీధిలో ఉన్న తమ కార్యాలయానికి నేరుగా వచ్చి దరఖాస్తులు అందజేయాలన్నారు. ఏప్రిల్ 5వ తేదీ నుంచి బ్యాచ్‌లు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు 90009 43413 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుల ధర్నా

విజయనగరం ఫోర్ట్: కేంద్ర ప్రభుత్వం కావాలనే కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీని అరెస్ట్ చేయించిందని డీసీసీ అధ్యక్షుడు సరగడం రమేష్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం స్థానిక డీసీసీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీని విమర్శిస్తే జైలుకు పంపిస్తారంటే... లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో రెహమాన్, చంద్రశేఖర్, సురేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మొయిదలో సంబరాలు



హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లిమర్ల రూరల్: ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఎమ్మెల్యేల కోటాలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు) విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని మొయిద విజయరామపురంలో ఉన్న సురేష్‌బాబు ఇంటికి ఆయన అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరుకుని సందడి చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



ఘటనాస్థలంలో అపస్మారక స్థితిలో పడిఉన్న ధనుంజయ

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామం వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో విజయనగరం జిల్లా రేగిడి మండలం పారంపేటకు చెందిన కుదిగాన ధనుంజయ(32) మృతి చెందాడు. ఈ ప్రమాదంపై ఎస్సై బి.శివప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భవననిర్మాణ కార్మికుడైన ధనుంజయ పని చేసుకునేందుకు గురువారం పాలకొండ మీదుగా ద్విచక్ర వాహనంపై పార్వతీపురం బయల్దేరాడు. ఈ క్రమంలో అట్టలి వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. గమనించిన స్థానికులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం..

- ఎస్ఎఫ్ఐ నాయకులు



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: బ్రిటీష్ వారి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమించాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సీహెచ్ పావని, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ఎం. సౌమ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి. రామ్మోహనరావు మాట్లాడుతూ, భారతదేశ విముక్తి కోసం పోరాటి అతి చిన్నవయసులోనే ఉరికంబం ఎక్కారాన్నారు. నాటి పోరాట యోధులు దేశం కోసం ప్రాణాలు అర్పిస్తే.. నేటి పాలకులు దేశాన్ని దోచేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా విద్యారంగాన్ని ప్రైవేట్‌పరం చేయడంతో పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రటరీ రమేష్, టౌన్ ఉపాధ్యక్షులు కిరణ్, సోమేష్, అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవయువ సమాఖ్య ఆధ్వర్యంలో..

నవయువ సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్ వర్ధంతి కార్యక్రమం స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎం. అప్పలరాజు, పీడీఎస్ఓ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. గౌతమి, కె. భాస్కరరావు, కె. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో...

ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతిలో నాయకులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకుడు బూర వాసు, ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని, జిల్లా అధ్యక్షురాలు బాయి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నవయువ సమాఖ్య నాయకులు



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు

వైభవంగా సిరి సహస్ర, ప్రదీప్ వివాహం



సిరిసహస్ర, ప్రదీప్‌ల వివాహ వేడుక

- నూతన వధూవరులను ఆశీర్వదించిన విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి

విజయనగరం:

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పుష్పాంజలి దంపతుల కుమార్తె సిరిసహస్ర, నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతుల కుమారుడు ప్రదీప్ వివాహ వేడుక గురువారం వైభవంగా జరిగింది. డెంకాడ మండలం దాకమర్రిలో గల రఘు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ నూతన వధూవరులు ఒక్కటయ్యారు. వివాహ వేడుకకు హాజరైన ఎంపీ వి.విజయసాయిరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, విజయనగరం జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, పార్వతీపురం జిల్లా కలెక్టర్ నిశాంత్‌షా, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్‌లతో పాటు ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆపరేషన్లు చేయడంలో విఫలం



ఫిర్యాదు పత్రాలను చూపిస్తున్న గో సంరక్షణా సమితి ప్రతినిధులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిధిలో కుక్కల ఆపరేషన్ల స్కామ్‌పై విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. నగరంలోని గో సంరక్షణ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో కుక్కలకు ఆపరేషన్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. యానిమల్ బర్త్ కంట్రోల్ యాక్ట్ 2001 నిబంధనల ప్రకారం కాకుండా కుక్కలను కర్రలతో, తాళ్లతో కట్టి హింసిస్తున్నారని తెలిపారు. కుక్కలకు శస్త్రచికిత్సలు చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ అనుమతులు లేకుండా చేపడుతున్న ఈ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ అండ్ కమిషనర్ మున్సిపల్ శాఖ (అమరావతి) వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పాండ్రంకి మురళి, రావాడ గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల మేరకే కుక్కలకు శస్త్రచికిత్సలు

విజయనగరం: నగరంలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, చిన్నారులపై దాడి చేసే అవకాశం ఉందని ప్రజలు ఫిర్యాదు చేయడంతో కుక్కలకు శస్త్రచికిత్సలు చేసినట్లు నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 630 కుక్కలకు ఆపరేషన్లు చేయించామన్నారు. వాటిని రెండు రోజుల పాటు సంరక్షించి అవసరమైన ఆహారం, మందులు అందించామని పేర్కొన్నారు.

టీడీపీ నాయకుల ఆరోపణలు హాస్యాస్పదం

- వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడిలో భూ కబ్జాలకు పాల్పడిన టీడీపీ నేత బొద్దుల నర్సింగరావు, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు కాజేసిన టీడీపీ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులపై ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. టీడీపీ నాయకుల తప్పుడు ఆరోపణలకు నిరసనగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారుర. ఈ సందర్భంగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్ మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు జన్మభూమి కమిటీల పేరుతో జనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఆ పార్టీ అధినేత అమరావతి, పోలవరాన్ని ఏటీఎంలా వాడుకుంటే ఇక్కడ నాయకులు నీరు– చెట్టు పేరుతో దోచేశారని మండిపడ్డారు. విజయనగరం మండల పరిధిలో టీడీపీ నేతలు ఎన్నో భూకబ్జాలకు పాల్పడ్డారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజారంజక పాలన సాగిస్తుంటే.. ఆయన బాటలోనే పార్టీ కార్యకర్తలు, నాయకులు గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని చెప్పారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేశారో ఇప్పటికీ వారి ఇంటి చుట్టూ తిరుగుతున్న నిరుద్యోగులను చూస్తుంటే అర్థమవుతుందన్నారు. అలాగే బొద్దుల నర్సింగరావు తన తండ్రి విగ్రహాన్ని కబ్జా చేసిన స్థలంలోనే ఏర్పాటు చేశారని ఆరోపించారు. అనంతరం మండలంలోని దుప్పాడ, ద్వారపూడి గ్రామాల్లో టీడీపీ నేతలు చేసిన కబ్జాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్ఐ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలి..

- మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి



డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం అర్బన్: దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ఈ నేపథ్యంలో అన్ని రంగాల్లోనూ అతివలు ముందుండాలని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో గురువారం స్థానిక జేఎన్‌టీయూ గురజాడ, విజయనరం (జీవీ) యూనివర్సిటీలో 'ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్' కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని, యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశోధనా రంగంలో సైతం మహిళలు ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. నూతనంగా ఏర్పడిన యూనివర్సిటీకి పేరు తెచ్చే విధంగా ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్‌తో పాటు విద్యార్థులు కృషి చేయాలన్నారు. రిజిస్ట్రార్ జి.స్వామినాయుడు మాట్లాడుతూ, మగవారితో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తుండడం అభినందనీయమన్నారు. ప్రతి మహిళా ధైర్య సాహసాలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం ముఖ్య అతిథి ఝాన్సీలక్ష్మిని సత్కరించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ జి.జయసుమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకుమార్, సెల్ డైరెక్టర్ డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, సెక్రటరీ డాక్టర్ బి.నళిని, ట్రెజరర్ డాక్టర్ పి.అరుణకుమారి, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రాజేశ్వరరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వీఎస్ వకుళ, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సీహెచ్.బిందుమాధురి, వివిధ విభాగాల మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న తోడు పథకంపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ దాసరి బంగారయ్య

భోగాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న తోడు పథకంపై వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బందితో ఎంపీడీఓ దాసరి బంగారయ్య గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, మండలంలోని సచివాయాల ద్వారా 691 మంది లబ్ధిదారులు జగనన్న తోడు పథకానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో ఇప్పటికే 349 మంది లబ్ధిదారులను గుర్తించి మండలంలోని వివిధ బ్యాంకులకు వారి దరఖాస్తులకు పంపించామన్నారు. మిగిలిన 342 మంది లబ్ధిదారుల దరఖాస్తులను త్వరిగతిన పరిశీలించి బ్యాంక్‌లకు అందజేయాలని వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వై.రమణ, సీసీలు శ్రీనివాసరావు, వాసు, విశ్వేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

31న న్యాయవాదుల సంఘ ఎన్నికలు



కార్యదర్శి పదవికి నామినేషన్ వేస్తున్న సంతోష్

- తొలిరోజు 5 నామినేషన్లు దాఖలు

విజయనగరం లీగల్: జిల్లా కేంద్ర న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఈ నెల 31న జరగనున్నాయి. తొలి రోజు అయిదు నామినేషన్లు దాఖలయ్యాయి. అధ్యక్ష పదవికి బి.కృష్ణారావు, కార్యదర్శి పదవికి వి.జి.సంతోష్, సాంస్కృతిక, క్రీడల కార్యదర్శి పదవికి యు.వి.రాజేష్, కోశాధికారి పదవికి సిహెచ్.శ్రీనివాసరావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవికి ఎస్.సుబ్రమణ్యం నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి పి.శ్రీరామమూర్తి తెలిపారు.

జర్నలిస్టుల నిరసన



కలెక్టర్ సూర్యకుమారికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: డిమాండ్ల సాధనలో భాగంగా గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఐజేయూ పిలుపు మేరకు 'సేవ్ జర్నలిజం డే' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ సూర్యకుమారికి వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే నాయకుడు పీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీవీ ప్రసాద్, వి.మహాపాత్రో, పంచాది అప్పారావు, వైఎస్ పంతులు, నాగరాజు, ఎంఎస్ ఎస్ రాజు, భరత్, డేవిడ్‌రాజు, ప్రతాప్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొండగంగుబూడి పంచాయతీలోని కోటయ్యగరువు, బడ్డీ చింతల గిరిజన గ్రామాల్లో వైద్యాధికారి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. 80 మందికి వైద్యపరీక్షలు చేసి, అయిదుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే చాలా వరకు వ్యాధులు దరిచేరవన్నారు. క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ పి.ఎస్.ఆర్.మూర్తి, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు వసూలు చేయండి

- మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఆర్‌డీ నాగరాజు

విజయనగరం: దీర్ఘకాలిక మొండి పన్ను బకాయిలను వసూలు చేయాలని అధికారులకు సిబ్బందికి మున్సిపల్ డైరెక్టర్ నాగరాజు ఆదేశించారు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు చాంబర్‌లో పన్ను వసూళ్లపై గురువారం సమీక్షించారు. మొండి బకాయిలు రాబట్టడంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 – 23 ఆర్థిక సంవత్సరానికిగాను ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇచ్చిన అంశంపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకు రావాలన్నారు. సచివాలయాలవారీగా ప్రతీ రోజు సమీక్షలను చేపట్టి అవసరమైతే మరింత మంది సిబ్బందితో మొండి బకాయిలను రాబట్టాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూలు లక్ష్యం రూ.43 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ. 28 కోట్లు వసూలైందన్నారు. మార్చి 31వ లోగా వీలైనంత ఎక్కువ శాతం వసూలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. నగరంలో పన్నుల వసూళ్లపై 12 టీమ్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. టీం సభ్యులందరూ మరింత కృషి చేసి అధిక మొత్తంలో పన్నులు రాబట్టేందుకు శ్రమించాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు కిరణ్, సాయి ప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపేటలో ఉన్న శునక సంరక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ కుక్కలకు అందుతున్న సంరక్షణ చర్యలపై ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.

భక్తి భావం

మండలంలోని జమ్ములో రామాలయం ప్రారంభోత్సవాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు, సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. విగ్రహాలకు అభిషేకాలు చేశారు. రామాలయంలో మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. సీతారాముల విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

– గుర్ల



రామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు